క్లుప్తంగా

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థిని ఎంపిక



మంగళగిరి: ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు యూనివర్సిటీ స్థాయిలో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థిని అశ్రిత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రహమాన్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సెప్టెంబర్ 15వ తేదీన నిర్వహించనున్న వర్సిటీ స్థాయి ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు సుమారు 200 మంది విద్యార్థులు హాజరు కాగా ఎంపికైన ముగ్గురు విద్యార్థులలో నిర్మల ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్.అశ్రిత ఎంపికయిందన్నారు. విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి అభినందించారు.

ఖోఖో జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖో ఖో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణచంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ హైస్కూల్ నిడమర్రులో నిర్వహించిన అండర్- 14, అండర్- 17 ఖోఖో స్కూల్ గేమ్స్‌లో గుంటూరు జిల్లా టోర్నమెంట్‌కు అండర్- 14 విభాగంలో జె.సిరిచందన, టి.ఎలియా, అండర్- 17 విభాగంలో ఎం.మధు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి.రమేష్‌బాబును, ఎన్.హరికృష్ణను, ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్‌కే సుభాని, బి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన సురేష్‌కుమార్, బత్తుల



తాడికొండ: ఏపీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి శుక్రవారం కలిశారు. నూతనంగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షులతో కలసి వెళ్లి సజ్జలను సన్మానించారు. 2024లో పార్టీ విజయానికి అందరూ సమష్టిగా పనిచేయాలని ఆయన సూచించినట్లు కత్తెర సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సజ్జలను కలసిన వారిలో బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, తాళ్లూరి వంశీ, కొప్పుల శేషగిరిరావు ఉన్నారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచి ఎం.శివకుమారి అన్నారు. మండలంలోని వేమవరం ఎంపీయూపీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శివకుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భోజనానికి ముందుగా శుభ్రంగా చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఎంఎల్‌హెచ్‌పీ రజిత వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, హెచ్‌ఎం డి.కమల్‌మోహన్, రవికుమార్, ప్రభాకర్, భారతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహన

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శుక్రవారం మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహ కల్పించారు. సంస్థ జోనల్ కో ఆర్డినేటర్ ఎస్.జాకబ్ రాజు మాట్లాడుతూ మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని, తెలిసో తెలియకో మాదక ద్రవ్యాలకు అలవాటు చేసుకుంటున్నారని, వీటి కారణంగా జీవితం దుర్భరంగా మారుతుందని వివరించారు. కో ఆర్డినేటర్ ఎండీ వసంత కుమారి మాట్లాడుతూ మత్తుపదార్థాల సేవనం వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబంతో సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

దొండపాడు(తాడికొండ): సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ప్రతి పేదవాడికి ఇంటివద్దే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం తుళ్లూరు మండలం దొండపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య సేవలను పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్న ఆయన వైద్య శిబిరంలో ఉన్న సౌకర్యాలు మీకు ప్రయోజనకరంగా ఉన్నాయా లేదా అని అడగగా పలువురు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటే రోగులకు అక్కడ వసతులు, వైద్యులు, మందులు ఉంటాయో లేదో అనే సందేహం ఉండేదన్నారు. కానీ నేడు రోగం రాకముందే ప్రతి పేదవాడి ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు చేసే రోజులు రావడం జగనన్నకు పేదలపై ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాల ద్వారా 105 రకాల రోగాలకు ఏడు రకాల పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల శేషగిరి రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, ఆరేపల్లి జోజి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొమ్మినేని దత్తు, సొసైటీ అధ్యక్షుడు కొమ్మినేని అప్పారావు, కొప్పుల ఆంద్రేయప్ప, ఎంపీడీవో శివన్నారాయణ, ఎంఈవో కోటేశ్వర రావు పాల్గొన్నారు.

పేరేచర్లలో..

మేడికొండూరు: ప్రజల ఆరోగ్యంపై దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయాలని వినూత్న పథకాలు చేపట్టి వారిపై శ్రద్ధ తీసుకుంటున్నారని తాడికొండ వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పేరేచర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, అబ్బాస్, ఎంపీటీసీలు మదమంచి శ్రీను, పల్లపు శ్రీను, సొసైటీ చైర్మన్ గాలీబ్, ముత్యాల బాలస్వామి, కోకా అర్జున్‌రావు, సుభాని పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో బీపీ పరీక్ష చేయించుకుంటున్న కత్తెర సురేష్‌కుమార్

బడేపురం(తాడికొండ): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సు రక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తాడికొండ మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ అన్నారు. తాడికొండ శివారు బడేపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వైద్య సేవలు చేరవేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఫ్యామిలీ హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు ప్రతి సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యులతో సేవలందిస్తున్నారన్నారు. ఈ సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తగిన అవగాహన కల్పించి విజయవంతం చేస్తున్నారన్నారు. శుక్రవారం 250 మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించి నెల కు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి తోకల సరోజినీ, డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు మాల్యాద్రి, శర్మ పాల్గొన్నారు.



బడేపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్



నేత్ర వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దుగ్గిరాల ఎంపీపీ, జెడ్పీటీసీ

పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా అని దుగ్గిరాల ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ పేర్కొన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలంటే ప్రజలు భయాందోళలనకు గురైనట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి నాడు నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికి వైద్యబృందాన్ని పంపించి ఇంటివద్దే వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఎవరికైనా ఉన్న ఆరోగ్య సమస్యలు పరిష్కారం కాకపోతే అదే గ్రామంలో నిపుణులైన డాక్టర్లను పంపి మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం నేత్రవైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు రజనీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు వి.రజనీ కాంత్, మండల అధ్యక్షులు ఎస్.రత్నం, వైద్యులు ప్రభాకర్ శివ, ఎండీ అబ్దుల్ రహమాన్, కె.తాజుద్దీన్ పాల్గొన్నారు.

నేతన్న విగ్రహ ఏర్పాట్లు పరిశీలన

మంగళగిరి: మంగళగిరి ఎస్‌ఆర్‌ఐ జంక్షన్‌లో ఏర్పాటు చేయనున్న నేతన్న విగ్రహ ఏర్పాట్లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ చేనేతకు ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిన మంగళగిరిలో చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే చరిత్ర మరువని విధంగా నగర ముఖద్వారంలో నేతన్న విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. చేనేత వృత్తి ప్రాముఖ్యత యావత్ దేశానికి తెలిసేలా జాతీయ రహదారి పక్కన నేతన్న విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.60 లక్షలతో నగర ముఖద్వారంలో జాతీయ జెండాతో పాటు నేతన్న విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఒక్క నేతన్న విగ్రహం ఏర్పాటు మాత్రమే కాక రూ.4 కోట్లతో చేనేత భవనం, రూ.3.50 కోట్లతో మగ్గం షెడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కేకు మంగళగిరి నేతన్నలంతా అండగా నిలుస్తారని తెలిపారు. నామినేటెడ్ పదవులలోను నేతన్నలకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు రామనాథం పూర్ణచంద్రావు, కాసుల రవి, ఊట్ల పాలశ్రీనివాసరావు పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి తదితరులు

యువ వ్యాపార వ్యవస్థాపకులకు ప్రత్యేక శిక్షణ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఆర్థిక సహాయం నిమిత్తం యువత రిజిస్ట్రేషన్ మరియు అప్లికేషన్ వివరాలు, అర్హతలు ఇంటర్‌నెట్‌లో పొందుపరిచిన అంశాల గురించి వివరించారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య మాట్లాడుతూ ఖాదీ గ్రామీణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. నవసమాజ నిర్మాణం, అభివృద్ధి గ్రామీణ అభివృద్ధితోనే ముడిపడి ఉందని అన్నారు. ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రవేశపెట్టిన పలు రకాల పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

జాషువా సాహిత్యంపై పోటీలు

తెనాలి: గుర్రం జాషువా కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాషువాపై వ్యాసరచన, పద్యపోటీలను నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయిని అస్మతున్నీసా పర్యవేక్షించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో విజేతలకు ఒకటో వార్డు కౌన్సిలరు గెడ్డేటి సురేంద్ర జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహూకరించారు. కళాపరిషత్ చైర్మన్ పెద్దిటి యోహాను, డాక్టర్ రంగిశెట్టి రమేష్ నవయుగకవి చక్రవర్తి గుర్రం జాషువా గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం కలిగించే ఉద్దేశంతో జాషువా సాహిత్యంపై పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యాకమిటీ చైర్మన్ మధిర రాజు, కార్యదర్శి జి.ఎస్.రాజు, ఉపాధ్యాయులు ప్రకాష్‌రావు, వెంకటరమణ, ఝాన్సీ, ఆదిలక్ష్మి, ప్రసూనాదేవి, ప్రసాద్, హరినాథ్, శ్రీనివాసరావు, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో అతిథులు

మాదకద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు

తెనాలిరూరల్: మాదకద్రవ్యాలు, గంజాయిని నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ డీఎన్ మహేష్ తెలిపారు. రాష్ట్రంలో గంజాయి సాగు విక్రయాలను అరికట్టడంతో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఎస్ఈబీ, ఆర్పీఎఫ్, జీఆర్పీ, సివిల్ పోలీసులు తెనాలి రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీల మాక్‌డ్రిల్‌ను శుక్రవారం నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన పోలీస్ జాగిలం 'రెమో' ప్రయాణికుల లగేజీ, ప్లాట్‌ఫాంలు, రైల్వే పార్శిల్ కార్యాలయంలో తనిఖీ చేసింది. ఐదో నంబరు ప్లాట్‌ఫాంపైకి జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ రాగా అందులో కొందరి ప్రయాణికుల లగేజీని పరిశీలించడంతో పాటు రైలు బోగీలోనికి వెళ్లి గంజాయి, మాదక ద్రవ్యాలను గుర్తించే ప్రయత్నం చేసింది. ఎస్ఈబీ అదనపు ఎస్పీ మహేష్ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల గురించిన సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 14500కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని కోరారు. తనిఖీల్లో తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, జీఆర్పీ సీఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎల్.సరస్వతి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతేఅలీబేగ్, ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, ఎస్ఐ వినీతారెడ్డి, తెనాలి వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు కె. చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు, రైల్వే స్టేషన్ మేనేజర్ టీవీ రమణ తనిఖీల్లో పాల్గొన్నారు. పోలీస్ జాగిలం రెమోకు మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాలను గుర్తించేందుకు శిక్షణ ఇచ్చినట్టు విజయ్‌రాజు తెలిపారు.



రైలు బోగీలో తనిఖీలు చేస్తున్న పోలీసు జాగిలం

రేవేంద్రపాడులో ఒకేషనల్ కోర్సులలో శిక్షణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులలో శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ట్రైనర్ పి.ఝాన్సీ మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్ ప్రాజెక్ట్‌ను యూఎన్ఓ సాఫ్ట్‌వేర్ ద్వారా ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. మల్టీమీటర్ డిజిటల్ ఎనలాగ్ మీటర్‌ను ఉపయోగించి ఓల్టేజ్ వాల్యూ, రెసిస్టెన్స్ వాల్యూను ఎలా కనుగొనాలో శిక్షణ ఇచ్చారు. ఒకేషనల్ ట్రైనర్ పి. కాత్యాయని మాట్లాడుతూ పత్తి నుంచి దారం తీయటం, రంగులు అద్దడం, చేనేత చీరలు, పంజాబీ డ్రస్ మెటీరియల్స్ ఎలా నేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీ రవి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శివకుమార్, శాంత, అరుణ విమల, సరోజా పాల్గొన్నారు.



కేఎల్‌యూలో ఒకేషనల్ కోర్సులలో శిక్షణ తీసుకున్న రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు

యువత దేశభక్తి కలిగి ఉండాలి

కేఎల్‌యూ డీన్ హనుమంతరావు

తాడేపల్లిరూరల్: యువత దేశభక్తి కలిగి ఉండి, సామాజంలో క్రమశిక్షణతో నడుచుకోవాలని కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు సూచించారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కలశ యాత్రను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా యువత నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి బియ్యం, మట్టిని సేకరించి ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులతో కలసి కలశ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్లు మౌనిక, పావని, హాబీ క్లబ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుభాకరరాజు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అబ్దుల్ బాసిత్, డాక్టర్ ఆర్.సుప్రియ, పి.సురేష్, జి.చంద్రశేఖర్, డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.



కలశ యాత్ర నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

నవులూరులో ఆక్రమణ తొలగింపు

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరులో రోడ్డు ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు శుక్రవారం తొలగించారు. నవులూరు రాగిచెట్టు సెంటర్‌లో స్థానికులు రోడ్డు ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేయగా రోడ్డు ఆక్రమణతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారు. ఆక్రమణదారులు అధికారులు అడ్డుపడడంతో రూరల్ ఎస్.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

తెనాలిఅర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన దోమల వ్యాప్తిని నియంత్రించ వచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం, మలేరియా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ముత్తింశెట్టి పాలెంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందే బాల చంద్రమౌళి, మలేరియా సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మేడికొండూరు: మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్ అన్నారు. మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలోని ఖాదర్ బాబా చెట్టు వద్ద మండల పరిషత్ నిధులతో నూతన బోరును శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ షేక్ గాలీబ్, ఎంపీటీసీ మదమంచి శ్రీను, పల్లపు శ్రీను, జనరాజుపల్లి నాగేశ్వరావు, ఎంపీడీవో ప్రభాకర్, ఈఓపీఆర్డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రహిమాన్ పాల్గొన్నారు.

రేపు రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎక్స్‌పో-2023

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎక్స్‌పో-2023ను ఈనెల 15న స్థానిక ఎన్జీఓ కళ్యాణమండపంలో నిర్వహించనున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత తెలిపారు. మహిళా సాధికారతను ప్రోత్సహించే మార్గంలో కొత్త మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను ప్రోత్సహించే లక్ష్యంగా ఎక్స్‌పో-2023ను నిర్వహించనున్నట్లు విలేకరుల సమావేశంలో వివరించారు.ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎక్స్‌పోలో మహిళలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. వీరితో వరలక్ష్మి, కల్యాణి, గాయత్రి, సృజన, జ్యోతి ఉన్నారు.

తుమ్మపూడిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు శుక్రవారం నిర్వహించారు. సర్పంచి అజీజూన్, పంచాయతీ సెక్రటరీ భవాని పర్యవేక్షించారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎస్ఈఓ పూర్ణారెడ్డి, ఏఎన్ఎం బుజ్జి ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఎమ్మెల్యే ఆర్కే సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమనిలో అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందించిన ఆర్థిక సహాయాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు మత్తె ఆనంద్ అందించారు. రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి రాఘవులు, కర్లపూడి రాజమ్మ, గేరా మరియమ్మ, చొక్కా కాంతారావు, కంచర్ల దావీదు, బాషా, గోపయ్య, జమ్ముల లోకేష్ పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

మంగళగిరి: పేద మహిళకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయంతో నిత్యావసరాలు శుక్రవారం అందజేశారు. నగరంలోని పాత మంగళగిరిలో నివాసముంటున్న ఆకురాతి లీలా సత్యవతి భర్త రోడ్డు ప్రమాదానికి గురయి మృతి చెందాడు. అదే ప్రమాదంలో సత్యవతి తీవ్రంగా గాయపడి చికిత్స పొందగా చికిత్స కొరకు అయిన ఖర్చులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతుందని స్థానిక నాయకులు ఎమ్మెల్యే ఆర్కేకు తెలియజేయగా స్పందించిన ఎమ్మెల్యే సత్యవతి కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ మహ్మద్ ఫిరోజ్, నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, నేరెళ్ల మురళి, గుంటి విజయలక్ష్మి, అంజి తదితరులున్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

మంగళగిరి: నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. మేరకు నిడమర్రుకు చెందిన చల్లా ఏడుకొండలు తెలంగాణ నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారం వచ్చింది. ఈ మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఏడుకొండలును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పాతబస్టాండ్ సెంటర్‌లో..

నగరంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. తాడేపల్లి బ్రహ్మానందపురానికి చెందిన గేరా ఏసుబాబు పట్టణంలోని వైన్స్‌లలో మద్యం బాటిళ్లను తీసుకెళ్లి అధికధరలకు విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాతబస్టాండ్ సెంటర్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఏసుబాబు వద్ద 20 మద్యం బాటిళ్లు లభించడంతో మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఏసుబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రేషన్ డీలర్ షేక్ గౌస్ లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బియ్యాన్ని అక్రమంగా బయటకు తరలించి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. బియ్యాన్ని తరలిస్తున్న వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మరియమాత మందిర వార్షికోత్సవం

ఫిరంగిపురం: దేవుడు దయామయుడని బాల ఏసుదేవాలయ విచారణ గురువు పి.బాలస్వామి అన్నారు. మండలంలోని మేరికపూడి గ్రామశివారులోని మరియమాత మందిర వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యపూజా బలి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మందిరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. దివ్యపూజా బలిలో విచారణ గురువులు ప్రభాకర్, జి.జోసఫ్, మెల్కియా, చిన్నప్ప, క్రాంతికుమార్, వినోద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడికొండ: 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లోమరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9–12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. తుళ్లూరు మండలంలో నెలవారి మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ చిలకరాజు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఒంటి వరకు కోత విధించనున్నట్లు చెప్పారు.